బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | శుక్రవారం జూన్ 26 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## వాణిజ్య ఎల్పీజీ సరఫరాలపై ఆంక్షల ఎత్తివేత

**హోటళ్లు, రెస్టారెంట్లు, పరిశ్రమలకు పూర్తి స్థాయిలో సరఫరా పునరుద్ధరణ**

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు క్రమంగా సద్దుమణుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు సరఫరా చేసే కమర్షియల్ ఎల్పీజీపై విధించిన అన్ని పరిమితులను ఎత్తివేస్తూ సాధారణ సరఫరాలను పునరుద్ధరించింది. పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి పెరగడం, విదేశాల నుంచి దిగుమతులు సాధారణ స్థితికి చేరుకోవడంతో సరఫరా వ్యవస్థ మెరుగుపడిందని పేర్కొంది.

అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్--ఇజ్రాయెల్ వివాదం, హార్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ ఇంధన సరఫరాలపై ప్రభావం పడింది. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో అధిక భాగం పశ్చిమాసియా దేశాల నుంచే దిగుమతి అవుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

మిగితా 2వ పేజీలో



# వెనెజువెలాలో వరుస భూకంపాల బీభత్సం...

- 164 మంది మృతి, మరో 971 మంది గాయపడ్డారు
- లక్ష మంది వరకు మృతి చెంది ఉండొచ్చని అంచనా!
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన తాత్కాలిక ప్రభుత్వం
- వెనెజువెలాకు అండగా ఉంటామన్న ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వెనెజువెలా దేశాన్ని వరుస భారీ భూకంపాలు వణికించాయి. బుధవారం సాయంత్రం కొద్దిక్షణాల వ్యవధిలోనే ఒకే ప్రాంతం కేంద్రంగా రెండు శక్తివంతమైన భూకంపాలు సంభవించడంతో ఊహించని స్థాయిలో విధ్వంసం జరిగింది. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ ఘోర విపత్తులో ప్రాణనష్టం భారీగా ఉండే అవకాశం ఉందని, మృతుల సంఖ్య 10 వేల నుంచి ఏకంగా లక్ష వరకు ఉండొచ్చని హెచ్చరించడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది.

యూఎస్‌జీఎస్ వివరాల ప్రకారం.. రాజధాని కారకాస్‌కు పశ్చిమాన ఉన్న శాన్ ఫెలిపే సమీపంలో మొదట రిక్టర్ స్కేలుపై 7.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ భయాందోళనల నుంచి తేరుకోకముందే, కొద్ది క్షణాల్లోనే సమీపంలోని యుమారే ప్రాంతంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం దూసుకొచ్చింది. రెండు భారీ భూకంపాలు ఒకే పరిధిని కేంద్రంగా చేసుకుని సంభవించడంతో రాజధాని కారకాస్ సహా పలు నగరాల్లో వందలాది భవనాలు కుప్పకూలిపోయాయి. విద్యుత్, సమాచార వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**దేశంలో అత్యవసర పరిస్థితి విధింపు**

తీవ్ర విపత్తు నేపథ్యంలో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ దేశంలో అత్యవసర పరిస్థితిని (జువవతీస్త్రవఅఎ) ప్రకటించారు. ఆమె టెలివిజన్ ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ దారుణ విపత్తులో ప్రాణనష్టం జరిగినట్లు అధికారికంగా ధ్రువీకరించారు. ఇప్పటివరకు లభించిన సమాచారం ప్రకారం 164 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 971 మంది గాయపడ్డారని ఆమె వెల్లడించారు. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నామని, తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం అత్యవసర స్పందన బృందాలు, సహాయక సిబ్బంది యుద్ధప్రాతిపదికన

మిగితా 2వ పేజీలో

# తుంగభద్రకు 'కొత్త' జలకళ..




- మూడు రాష్ట్రాల సీఎంల సమక్షంలో చారిత్రాత్మక ఘట్టం!
- రూ.51 కోట్లతో ఏర్పాటు చేసిన 33 స్పీల్ వే గేట్లు ప్రారంభం
- ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్, సీఆర్ పాటిల్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న జీవనాడి.. తుంగభద్ర ప్రాజెక్టు చరిత్రలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కర్ణాటకలోని విజయనగర జిల్లాలో ఉన్న తుంగభద్ర డ్యాంలో రూ.51 కోట్ల భారీ వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 33 స్పీల్ వే గేట్లను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సంయుక్తంగా ఈ గేట్లను ప్రారంభించి జలవనరుల అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు. ముగ్గురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రి ఒకే వేదికపై కలిసి ఈ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గతేడాది భారీ వరదల సమయంలో తుంగభద్ర డ్యాంకు చెందిన ఒక గేటు తీవ్రంగా దెబ్బతిన్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో డ్యాం భద్రత, పాత గేట్ల నిర్వహణపై రైతులు, ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రభుత్వాలు సమన్వయంతో కదిలాయి. యుద్ధప్రాతిపదికన నిధులు కేటాయించి, ఆధునిక సాంకేతికతతో 33 కొత్త స్పీల్ వే గేట్ల నిర్మాణాన్ని తక్కువ సమయంలోనే పూర్తి చేశాయి. ఈ కొత్త గేట్ల ఏర్పాటుతో వరదల సమయంలో నీటి విడుదల నిర్వహణ మరింత సులభం కానుందని, ప్రాజెక్టు భద్రతపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని అధికారులు వెల్లడించారు.

**రాష్ట్రాల సమన్వయానికి దిక్సూచి..**

తుంగభద్ర ప్రాజెక్టు కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా.. దక్షిణ భారత దేశంలోని మూడు కీలక రాష్ట్రాల వ్యవసాయ రంగానికి ప్రధాన ఆధారం. ప్రజల ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాలు ఏ విధంగా కలిసి పనిచేయవచ్చో చెప్పడానికి ఈ కార్యక్రమం ఒక దిక్సూచిగా నిలిచింది. ఈ వేడుకలో ఏపీ ముఖ్యమంత్రితో పాటు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు.. రికార్డు కాలంలో పనులు పూర్తి చేసిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులను ప్రత్యేకంగా అభినందించారు.

**రాయలసీమ, కర్ణాటక రైతాంగానికి పెద్ద భరోసా**

తుంగభద్ర జలాలపై లక్షలాది ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉంది. ముఖ్యంగా ఏపీలోని కరవు పీడిత రాయలసీమ ప్రాంతంతో పాటు కర్ణాటకలోని పలు జిల్లాలకు ఈ డ్యాం ప్రాణాధారం. కొత్త గేట్ల ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు, నీటి వృథాను అరికట్టవచ్చునని జలవనరుల నిపుణులు చెబుతున్నారు. ఇది ఈ ప్రాంత రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను చేకూర్చనుంది.

**హోసపేటలో భారీ బహిరంగ సభ:**

గేట్ల ప్రారంభోత్సవం అనంతరం ముగ్గురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రి కలిసి హోసపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సభకు మూడు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన రైతులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నాయకులు తుంగభద్ర ప్రాజెక్టు ప్రాధాన్యత, అంతరాష్ట్ర నీటి వనరుల సమన్వయం మరియు భవిష్యత్తు కార్యాచరణపై ప్రసంగించనున్నారు.

## ఉద్యోగులందరికీ రూ.కోటి ప్రమాద బీమా




**ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వర్తింపు.. 16 బ్యాంకులతో ఒప్పందాలు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకానికి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆయన శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో 16 బ్యాంకులతో ప్రమాద బీమా ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, వారి సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

**ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా**

సింగరేణిలో ప్రమాద బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేశామని, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు సీఎం తెలిపారు. ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేకపోయినా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

సింగరేణి తరహాలోనే రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికి రూ.కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సూచించినట్లు వెల్లడించారు. తాను సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, గతంలో తనను కొందరు అవహేళన చేశారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రజల ప్రేమాభిమానాలే తనకు ముఖ్యమని, 'రేవంతన్న' అని పిలిపించుకోవడమే తనకు ఇష్టమని తెలిపారు. ప్రేమ, ఆప్యాయత ఉంటేనే ప్రజలు నాయకులను అన్నగా భావిస్తారని, ప్రజలతో సన్నిహిత సంబంధాలే తన

మిగితా 2వ పేజీలో

## తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ చరిత్రలో నిలిచిపోతుంది

**మూడు రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు: సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తుంగభద్ర గేట్ల పునరుద్ధరణకు నిర్ణయించిన ముహూర్తం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు తరాలుగా కొనసాగుతున్న సమస్యలకు 33 గేట్ల పునరుద్ధరణ ద్వారా పరిష్కారం లభించబోతుందని ఆయన పేర్కొన్నారు. తుంగభద్ర జలాలు బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు ప్రాంతాల నీటి అవసరాలను తీర్చగలవని సీఎం తెలిపారు. తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయడం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రత్యేకత అని కొనియాడారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన రేవంత్‌రెడ్డి, నీటి వివాదాలు పరిష్కారం కాకపోతే విలువైన జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తుంగభద్ర జలాల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే లక్ష్యంతో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై సమావేశం కావడం చారిత్రక పరిణామమని పేర్కొన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ద్వారా తెలంగాణకు రావాల్సిన 15.9 టీఎంసీల నీటిలో ప్రస్తుతం కేవలం ఐదు నుంచి ఆరు టీఎంసీలే అందుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 10 టీఎంసీల నీరు రాష్ట్రానికి అందడం లేదని తెలిపారు. ఈ సమస్యను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

తుంగభద్రలో మట్టిపొరలు పేరుకుపోవడం, నీటి తరలింపు సమస్యలు, జలవనరుల నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీఎం కోరారు. కర్ణాటక నాయకత్వం సూచన మేరకు మూడు రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తుంగభద్ర ఒడ్డున జరిగిన ఈ సమావేశం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని, ఈ నిర్ణయాలు భవిష్యత్తులో అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారానికి దారితీస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల ప్రతినిధులు సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో తుంగభద్ర సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడని, ప్రాంత సమస్యలపై ఆయనకు పూర్తి అవగాహన ఉందని సీఎం పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల సమన్వయంతో నీటి వివాదాలకు ముగింపు పలికే దిశగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఈపీఎఫ్ఓ చందాదారులకు అలర్ట్

**నాలుగు రోజుల పాటు ఆన్‌లైన్ సేవలు బంద్**

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉద్యోగులు వినియోగించే ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్ (ఎస్టాబ్లిష్‌మెంట్ పోర్టల్), ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో అధికారికంగా ప్రకటించింది.

జూన్ 26 (శుక్రవారం) నుంచి జూన్ 29 (సోమవారం) వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ-పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ (ఖాచీ) లింకింగ్, ఈసీఆర్ (జుజక్మ) ఫైలింగ్ వంటి కీలక సేవలు చందాదారులకు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా భవిష్యత్తులో సభ్యులకు మరింత వేగవంతమైన, సురక్షితమైన డిజిటల్ సేవలు అందించడమే ఈ అప్‌గ్రేడేషన్ ముఖ్య ఉద్దేశమని ఈపీఎఫ్‌వో స్పష్టం చేసింది.

ఈ ఆన్‌లైన్ సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంస్థ వెల్లడించింది. అయితే, ఉమంగ్ యాప్‌లో లభిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు పూర్తిగా అందుబాటులోకి రావడానికి జులై 2 వరకు సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పీఎఫ్ సభ్యులు, సంస్థల యజమానులు తమ అత్యవసర పనులను ఈ గడువును దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

సిస్టమ్ డౌన్ టైమ్‌లో చందాదారులకు ఏవైనా అత్యవసర సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైతే సంప్రదించడానికి ఈపీఎఫ్‌వో ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. పీఎఫ్ సభ్యులు లిలి14470లిలి నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని లేదా సమాచారాన్ని తెలుసుకోవచ్చని సంస్థ పేర్కొంది.

# తెలంగాణలో సర్ షురూ

**ఇంటింటికీ బీఎల్‌వోల సందర్శన.. జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఓటరు జాబితాల సమగ్ర సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్?యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు గృహాలను సందర్శించి ఫారాలను అందజేయనున్నారు. అనంతరం మరోసారి ఇంటింటికీ వెళ్లి నింపిన ఫారాలను స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే లక్ష్యంగా అధికారులు తెలిపారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తారు. అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రకటించనున్నారు.

ఓటర్లు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా పరిశీలించుకోవచ్చని అధికారులు సూచించారు.

**ఓటరు వివరాల కోసం:**

**తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్**

ఇదిలా ఉండగా, వనపర్తి జిల్లాలో కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రైవేట్ కాలేజీలకు హైకోర్టులో స్వల్ప ఊరట

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఫీజుల వసూలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్-9లోని కొన్ని మార్గదర్శకాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొన్న నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం, వచ్చే మంగళవారం వరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్నలు**

విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు పలు ప్రశ్నలు అడిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని చెప్పడం వల్ల కళాశాలలు ఎలా నిర్వహణ సాగిస్తాయని ప్రశ్నించింది.ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం ఎంత మేర బడ్జెట్ కేటాయించిందని, బడ్జెట్ సమావేశాలు ముగిసినప్పటికీ పెండింగ్ బకాయిలు ఎందుకు విడుదల కాలేదని ధర్మాసనం ప్రశ్నించింది. బకాయిల చెల్లింపులకు స్పష్టమైన గడువు తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, ప్రభుత్వం నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లిస్తే తాము దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకుంటామని కోర్టుకు వెల్లడించాయి.

ఈ కేసులో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం, కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నష్టపోతున్నారని వారి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ప్రత్యేకించి రెండో, మూడో, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని కోరారు. అలాగే ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థులకు మాత్రమే కొత్త నిబంధనలు వర్తించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. హైకోర్టు తదుపరి విచారణను జూన్ 30కు వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వం, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థుల వాదనలు కీలకంగా మారనున్నాయి.

## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు

**జులై 1 నుంచి కొత్త రుసుములు అమలు.. తత్కాల్ సేవలకూ పెరిగిన ఛార్జీలు**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పాస్‌పోర్ట్ దరఖాస్తు రుసుములను కేంద్ర విదేశాంగ శాఖ భారీగా పెంచింది. 2012 తర్వాత తొలిసారిగా పాస్‌పోర్ట్ ఫీజుల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సవరించిన కొత్త రుసుములు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్ కోసం రూ.1,500 వసూలు చేస్తుండగా, కొత్తగా దానిని రూ.2,500కు పెంచారు. తత్కాల్ సేవ కింద జారీ చేసే పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.3,500 ఉండగా, ఇకపై రూ.5,000 చెల్లించాల్సి ఉంటుంది.

**60 పేజీల పాస్‌పోర్ట్‌కూ పెరిగిన ఫీజు**

60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2,000 రుసుము ఉండగా, కొత్తగా దానిని రూ.3,500గా నిర్ణయించారు. తత్కాల్ కేటగిరీలో ఈ పాస్‌పోర్ట్‌ను పొందాలంటే రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది.

**మైనర్లకు కొత్త రుసుములు**

18 సంవత్సరాల లోపు దరఖాస్తుదారుల కోసం ప్రస్తుతం రూ.1,000గా ఉన్న పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,750కు పెంచారు. తత్కాల్ సేవల కోసం రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్ల పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా లేదా దెబ్బతిన్నా కొత్త పాస్‌పోర్ట్ జారీకి సాధారణ కేటగిరీలో రూ.4,250, తత్కాల్‌లో రూ.6,750 రుసుము నిర్ణయించారు.

పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ), సరెండర్ సర్టిఫికెట్, గ్లోబల్ ఎంట్రీ ప్రోగ్రామ్ వెరిఫికేషన్, ఇతర పాస్‌పోర్ట్ సంబంధిత ధ్రువపత్రాల కోసం దేశీయంగా రూ.750 రుసుము నిర్ణయించారు. విదేశాల్లో ఈ సేవలకు 40 డాలర్లు వసూలు చేయనున్నారు.

# దేశంలో ఎల్ నినో ముప్పు..

**వర్షాభావంపై 315 జిల్లాలకు కేంద్రం అలర్ట్!లిలి**
**లిఅత్యంత ప్రమాదకర కేటగిరీలో 111 జిల్లాలు; అత్యవసర ప్రణాళికలు అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశం**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ తాజాగా గుర్తించింది. రానున్న రోజుల్లో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను తక్షణమే అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ 315 జిల్లాలను సాగునీటి వసతుల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. ఇందులో 25 శాతం కంటే తక్కువ సాగునీటి సౌకర్యం కలిగి, వర్షాలపైనే ఆధారపడే 111 జిల్లాలను 'అత్యంత ప్రమాదకర' జోన్‌గా కేంద్రం ప్రకటించింది.

కేంద్ర వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం.. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను 'మధ్యస్థ ప్రమాదకర' కేటగిరీలో చేర్చారు. అలాగే 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం కలిగి, ఎల్ నినో ప్రభావాన్ని కొంతవరకు తట్టుకోగల 128 జిల్లాలను 'సాపేక్షంగా తక్కువ ముప్పు' ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న 111 జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, ఒడిశాతో పాటు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విస్తరించి ఉన్నాయి.

ґ బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. తక్కువ నీటితో పండే పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు (మిల్లెట్స్), నూనె గింజల సాగును ప్రోత్సహించాలన్నారు. పంటల వైవిధ్యం, భూమిలో తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని స్పష్టం చేసింది. అలాగే చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత పనుల ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని ఆదేశించింది.

మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి (ఖచీ) వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ క్లైమేట్ అవుట్‌లుక్ ఫోరం' అంచనాల ప్రకారం.. ఈ ఏడాది భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో (ూూూ) కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి దేశంలో ఆహార ద్రవ్యోల్బణం (ఫీశీీ క్ష్మీఅటశ్రీఠ్‌ఱశీఅ) ఒక్కసారిగా పెరిగిపోయే ప్రమాదం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పాఠ్యపుస్తకాల్లో 'ఎమర్జెన్సీ'..




**ఐదు దశాబ్దాల తర్వాత ఎన్‌సీఈఆర్‌టీ కీలక నిర్ణయం!లిలి**
**9వ తరగతి సాంఘిక శాస్త్రంలో ప్రత్యేక పాఠ్యాంశం; 'ప్రజాస్వామ్య ప్రధాన సవాళ్లలో ఒకటి'గా గుర్తింపులిలి**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

భారతదేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ఐదు దశాబ్దాలు (50 ఏళ్లు) దాటిన తర్వాత విద్యా రంగంలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 9వ తరగతి పాఠ్యపుస్తకంలో ఎమర్జెన్సీ అంశాన్ని ఒక ప్రత్యేక పాఠంగా జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రవేశపెట్టింది. అత్యవసర పరిస్థితి కాలంలో పౌరుల ప్రాథమిక హక్కుల్లో చాలా వరకు రద్దు అయినందున.. దీనిని భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న ప్రధాన సవాళ్లలో ఒకటిగా ఈ నూతన పాఠ్యాంశంలో పొందుపరిచారు.

ఎన్‌సీఈఆర్‌టీ తాజాగా రూపొందించిన 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్' అనే సాంఘిక శాస్త్ర (ాశీఎఱుశ్రీ ాఎఱవఅఎవ) పాఠ్యపుస్తకంలో ఈ చారిత్రాత్మక ప్రస్తావన కనిపిస్తుంది. ఈ పుస్తకంలోని 'భారత ప్రజాస్వామ్య బలాలు, సవాళ్లు' అనే అధ్యాయంలో (జష్ణుఱజ్‌వతీ) ఎమర్జెన్సీని చేర్చారు. "భారతదేశంలో ప్రజాస్వామ్యం తన ప్రయాణంలో ఎదుర్కొన్న అత్యంత ప్రధానమైన సవాళ్లలో 1975–77 మధ్య కాలంలో విధించిన అత్యవసర పరిస్థితి ఒకటి" అని ఆ పాఠ్యాంశంలో విద్యార్థులకు అర్థమయ్యేలా స్పష్టంగా పేర్కొన్నారు.

దేశంలో ఎమర్జెన్సీ విధించిన నాటి రాజకీయ పరిస్థితులు, పౌర హక్కుల హరణం, పత్రికలపై ఆంక్షలు మరియు ఆ తర్వాత ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిన విధానాన్ని భావితరాలకు వివరించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పులు చేసినట్లు విద్యా రంగ నిపుణులు భావిస్తున్నారు. ఐదు దశాబ్దాల పాటు పాఠశాల స్థాయి సిలబస్‌లో పెద్దగా ప్రస్తావనకు నోచుకోని ఈ వివాదాస్పద చారిత్రాత్మక ఘట్టాన్ని ఇప్పుడు నేరుగా పాఠ్యపుస్తకాల్లో చేర్చడం దేశవ్యాప్తంగా విద్యా, రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# రియల్ ఎస్టేట్‌ను వంద ఫీట్ల లోతులో పాతిపెట్టారు

**ఎన్నికల ముందు కోటి పలికిన భూమి..**
**ఇప్పుడు రూ.50 లక్షలకే దిక్కులేదు**
**ఎమ్మెల్యే, ఎంపీ పదవులు పోయినా కేడర్ తగ్గలేదు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవీ, హైదరాబాద్**

"ఎన్నికలకు ముందు రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని రంగురంగుల ఫోజులు కొట్టిన ముఖ్యమంత్రి.. ఇవాళ రాష్ట్రంలో ఆ రంగాన్ని వంద ఫీట్ల లోతులో బొంద పెట్టారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ (ూక్ష్మీక్మ) శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**గుండెల్లో రైళ్లు ఉరికించే దృశ్యం..**

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం ప్రభుత్వం, పవర్ లేకపోయినా కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. "ఎమ్మెల్యే పోయినా, ఎంపీ పోయినా, అధికారం చేజారినా.. చేవెళ్ల గడ్డపై ఇంతమంది సోదరులు తరలివచ్చి చూపిస్తున్న ఈ జెండా బలం మామూలు విషయం కాదు. ఈ దృశ్యం చూస్తుంటే కాంగ్రెస్, బీజేపీ పార్టీల గుండెల్లో రైళ్లు ఉరుకడం ఖాయం" అని పేర్కొన్నారు.

ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో పాటు నియోజకవర్గ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై నూతన కార్యవర్గానికి వారు దిశానిర్దేశం చేశారు.

**మనం తెచ్చిన కంపెనీలతో రూ.3 కోట్లు.. నేడు రూ.50 లక్షలకే గతి లేదు!**

గత ప్రభుత్వ హయాంలో చేవెళ్ల, షాబాద్ ప్రాంతాలకు జరిగిన పారిశ్రామిక విప్లవాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. "ఒకప్పుడు షాబాద్, చందన్‌వెల్లి, సీతారాంపూర్ పరిసరాల్లో ఎకరం భూమి ధర కేవలం రూ.30 లక్షలు ఉండేది. కానీ, మనం పట్టుబట్టి పారిశ్రామిక పార్కులు (క్ష్మీఅఉబరఠీఱుశ్రీ ూఱతీఎ) తీసుకొచ్చి.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌ఫన్ లాంటి దిగ్గజ కంపెనీలను ఇక్కడికి రప్పించాం. దాంతో షాబాద్‌లో ఎకరం రూ.3 కోట్లకు పైగా పలికింది. కానీ, రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి బతికే లక్షలాది మంది తమ్ముళ్లు, చెల్లెళ్లు ఇవాళ రోడ్డున పడి, దివాళా తీసే పరిస్థితి వచ్చింది. ఎన్నికల ముందు ఎకరం కోటి రూపాయలు పలికిన భూమిని.. ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు ఇస్తామన్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇంత దారుణమైన పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రజలు, రైతులు ఆలోచించాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# వెనెజువెలాలో వరుస భూకంపాల బీభత్సం...

(మొదటి పేజీ తరువాయి)

గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

వెనెజువెలాకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అవసరమైన అత్యవసర సహాయాన్ని అందించేందుకు అమెరికా విదేశీ సహాయ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించారు. శోధన–రక్షణ (సెర్చ్ అండ్ రెస్క్యూ) బృందాలు, వైద్య నిపుణులు, అత్యవసర మందులు, మానవతా సహాయ సామగ్రిని తొలి దశలోనే వెనెజువెలా తాత్కాలిక ప్రభుత్వ సమన్వయంతో అక్కడికి తరలించేందుకు కసరత్తు ప్రారంభించినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు.

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ**

వెనెజువెలా భూకంపంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలా ప్రజలకు భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "భారత ప్రజల తరపున వెనెజువెలా ప్రభుత్వం, అక్కడి ప్రజలకు మా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాం. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం. ఈ సంక్షోభ సమయంలో బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది" అని ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కౌంటర్లకు హైకోర్టు 'చివరి' అవకాశం!

**దానం, బండ్లకు రెండు వారాల గడువు; తదుపరి విచారణ జూలై 22కు వాయిదా వేసిన సీజే బెంచ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా గెలుపొంది, అధికార కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు గురువారం మరోసారి కీలక విచారణ చేపట్టింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు స్పీకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి (చీఫ్ జస్టిస్) జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ఈ సందర్భంగా కౌంటర్లు దాఖలు చేయని ఇద్దరు ఎమ్మెల్యేల తీరుపై బెంచ్ తీవ్రంగా స్పందిస్తూ.. కౌంటర్ల దాఖలుకు ఇదే చిట్టచివరి అవకాశమని తేల్చి చెప్పింది.

**ఇద్దరు మినహా అందరి కౌంటర్లు దాఖలు..**

విచారణ ప్రారంభం కాగానే పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు హైకోర్టు దృష్టికి ఒక అంశాన్ని తీసుకొచ్చారు. ప్రతివాదులైన ఫిరాయింపు ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా ఇప్పటికే తమ కౌంటర్లను దాఖలు చేశారని కోర్టుకు తెలిపారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు స్పందిస్తూ, కౌంటరు దాఖలు చేయడానికి మరో వారం రోజులు గడువు కావాలని కోరారు. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేస్తూ.. కౌంటర్లు దాఖలు చేసేందుకు ఇప్పటికే అనేక వాయిదాలు ఇచ్చామని, అయినా ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది.

**కోర్టు విధించిన గడువుల వివరాలు:**

2 వారాలు: ఇప్పటివరకు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయని దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలకు కౌంటర్లు సమర్పించడానికి కోర్టు విధించిన గడువు.

1 వారం: కౌంటర్లు దాఖలైన అనంతరం పిటిషనర్లు (బీఆర్ఎస్) రిప్లై కౌంటర్లు దాఖలు చేయడానికి ఇచ్చిన సమయం.

3 వారాలు: అన్ని పక్షాలు తమ రాతపూర్వక వాదనలను కోర్టుకు సమర్పించాల్సిన గడువు.

జూలై 22: కేసు తదుపరి తుది విచారణ జరగనున్న తేదీ.

**10 పిటిషన్లపై విచారణ..**

బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టీ ప్రకాశ్‌గౌడ్, ఏ గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను గతంలో స్పీకర్ కొట్టివేశారు. స్పీకర్ ఇచ్చిన ఆ తీర్పులను రద్దు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జీ జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కే సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్ ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డిలతో పాటు బీజేపీ శాసనసభాపక్ష నేత (ఏీూ) ఏ మహేశ్వర్‌రెడ్డి మొత్తం పది పిటిషన్లను హైకోర్టులో దాఖలు చేశారు. కౌంటర్ల దాఖలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, తదుపరి సమగ్ర విచారణను జూలై 22కు వాయిదా వేస్తున్నట్లు ఉన్నత న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష



**లడఖ్ హక్కులు, విద్యా రంగంలో జవాబుదారీతనంపై కేంద్రానికి అల్టిమేటం; ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా పోరాటం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

లడఖ్ స్వయంప్రతిపత్తి హక్కుల సాధనతో పాటు దేశ విద్యా రంగంలో జవాబుదారీతనం కోరుతూ ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మరోసారి ఉద్యమ పంథా పట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో జూన్ 28 నుంచి తాను ఆమరణ నిరాహార దీక్షకు దిగనున్నట్లు ఆయన గురువారం అధికారికంగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వానికి ఆయన కొన్ని కీలక డిమాండ్లను ముందుంచుతూ గడువు విధించారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేస్తున్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం, లేదా లడఖ్‌కు అదనపు అధికారాలు కల్పించడం.. ఈ రెండింటిలో కనీసం ఒక్క డిమాండ్‌నైనా జూన్ 27 లోగా ప్రభుత్వం నెరవేర్చాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఒకవేళ శనివారం (జూన్ 27) లోగా కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోతే.. జూన్ 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటానని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ґ లడఖ్ పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల హక్కుల కోసం గతంలోనూ సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుత విద్యా రంగ పరిణామాలపై జవాబుదారీతనం కోరుతూ, లడఖ్‌కు రాజ్యాంగ రక్షణ కల్పించడమే ధ్యేయంగా ఆయన ఈ సరికొత్త పోరాటానికి సిద్ధమయ్యారు. వాంగ్‌చుక్ దీక్షా ప్రకటనతో దేశ రాజధానిలో రాజకీయ, సామాజిక వర్గాల్లో మరోసారి చర్చ మొదలైంది.

## సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రలు జరుగుతున్నాయి

**బాల్క సుమన్**

**బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

సింగరేణిని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనను రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. చంచల్‌గూడ జైలు నుంచి గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదలైన బాల్క సుమన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు, బీఆర్ఎస్వీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జైలు వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ పూలదండలతో ఆయనను అభినందించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బాల్క సుమన్, సింగరేణిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నప్పటికీ 49 శాతం వాటా కలిగిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయమయ్యాయని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పరిశీలనకు వెళ్లినప్పటికీ బొగ్గు నిల్వలను అధికారులు చూపించలేదని పేర్కొన్నారు. నిల్వలు నిజంగా ఉంటే వాటిని ప్రజలకు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.

సింగరేణిలో రూ.15 వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపించిన బాల్క సుమన్, దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కొందరు వ్యక్తులు కీలక పాత్ర పోషించారని ఆరోపిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. విజిలెన్స్ విచారణల పేరుతో సింగరేణి కార్మికులను ప్రభుత్వం వేధిస్తోందని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గని కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టామని, భూ పట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. సంస్థ ప్రైవేటీకరణకు సంబంధించిన ఎలాంటి ప్రయత్నాలనైనా కార్మికులు, ప్రజలు కలిసి అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

27 రోజుల పాటు జైలులో ఉన్న సమయంలో పరామర్శించిన పార్టీ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ లీగల్ టీమ్‌కు బాల్క సుమన్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు, సింగరేణి కార్మికులు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వాణిజ్య ఎల్పీజీ సరఫరాలపై ఆంక్షల ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. అందుబాటులో ఉన్న నిల్వలను గృహ వినియోగదారులకు మళ్లించేందుకు వాణిజ్య ఎల్పీజీ సరఫరాలపై తాత్కాలిక పరిమితులు విధించింది.

ఆంక్షల కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థలు, పలు పరిశ్రమలు సాధారణ అవసరాల కంటే తక్కువ పరిమాణంలోనే ఎల్పీజీని వినియోగించాల్సి వచ్చింది. కొన్ని రంగాలకు సరఫరాలను పూర్తిగా నిలిపివేయగా, తరువాత దశల వారీగా పరిమితులను సడలించారు. అనేక పరిశ్రమలు తమ అవసరాల్లో సగం మేర మాత్రమే ఎల్పీజీ అందుకోవడంతో కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి.

అమెరికా––ఇరాన్ మధ్య తాత్కాలిక అవగాహన ఏర్పడటం, ప్రాంతీయ పరిస్థితులు మెరుగుపడటం, దిగుమతి ట్యాంకర్ల రాక కొనసాగడంతో ఎల్పీజీ సరఫరా వ్యవస్థ స్థిరపడింది. దీంతో యుద్ధ సంక్షోభానికి ముందు ఉన్న స్థాయిలోనే వాణిజ్య ఎల్పీజీ సరఫరాలను పునరుద్ధరించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

**గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేవు**

సంక్షోభ సమయంలో గృహ వినియోగదారులకు ఎలాంటి కొరత తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అవసరమైతే ఎల్పీజీ ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక అధికారాలను కూడా వినియోగించింది. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, పరిశ్రమలు తిరిగి పూర్తి స్థాయిలో ఎల్పీజీ సరఫరాలను పొందనున్నాయి.

# ఉద్యోగులందరికీ రూ.కోటి ప్రమాద బీమా

(మొదటి పేజీ తరువాయి)

బలం అని చెప్పారు.ఉద్యోగుల విశ్వాసమే ప్రభుత్వానికి బలమని పేర్కొన్న సీఎం, పీఆర్సీ విషయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమంలో ఉద్యోగుల కృషి, సేవలు కీలకమని కొనియాడారు. ప్రభుత్వా నికి మంచి పేరు వస్తే అది ఉద్యోగుల శ్రమ ఫలితమేనని, భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు లభించినా అందులో ఉద్యోగుల పాత్రే ప్రధానమని వ్యాఖ్యానించారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందలేదని ఆరోపించిన రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి నెల తొలి తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బెనిఫిట్ల రూపంలో నెలకు సుమారు రూ.1,000 కోట్ల చెల్లింపుల భారం ఉందని వెల్లడించారు.

మూసీ నది పునరుద్ధరణ, మెట్రో విస్తరణ కార్యక్రమాలను కొందరు అడ్డుకుంటున్నారని సీఎం విమర్శించారు. ఈ ప్రాజెక్టులు పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడతాయని, ఫామ్‌హౌస్‌లలో ఉండే వారికి వాటి అవసరం తెలియకపోవచ్చని వ్యాఖ్యానించారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ వంటి కార్యక్రమాలు నగరాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగులు కోరిన సదుపాయాలు కల్పించాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని, అయితే ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తోందని సీఎం తెలిపారు. అక్రమాలను అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆదాయం పెరిగితే ఉద్యోగులు కోరిన అన్ని అంశాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు

# ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి



**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, వేములవాడ**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు వేములవాడ అర్బన్ మండలం చింతల్థన గ్రామంలో బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) నిర్వహించిన అవగాహన సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు..

ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గతంలో 2002లో చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమం తరహాలోనే ప్రస్తుతం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు... ప్రతి ఓటరు తమ ఓటు పేరు బీఎల్ఓల వద్ద ఉన్న ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సామాజిక బాధ్యతగా గ్రామాల్లో ప్రజలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించాలని తెలిపారు.. ఎన్నికల సంఘం అనుమానాస్పద లేదా పరిశీలన జాబితాలో చేర్చిన ఓట్లకు సంబంధించి ఆయా ఓటర్లకు బీఎల్ఏలు సమాచారం అందించాలని అన్నారు. ఓటరు జాబితాలో ఏదైనా కారణంతో పేరు లేకపోతే, సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు సమర్పించేలా ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు..

గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు, విదేశాల్లో చదువుకుంటున్న వారి వివరాలను కుటుంబ సభ్యులు బీఎల్ఏలకు అందించాలని చెప్పారు. అవసరమైతే కుటుంబ సభ్యులు అఫిడవిట్ రూపంలో సంబంధిత అధికారులకు వివరాలు సమర్పించాలని తెలిపారు.నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో డప్పు చాటింపు, మైక్ ప్రకటనల ద్వారా ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో ఇప్పటికే 80 శాతానికి పైగా ఓటరు మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో బీఎల్ఏలకు శిక్షణ శిబిరాలు కూడా నిర్వహించామని చెప్పారు.ఈ సందర్భంగా బీజేపీ ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో బీజేపీకి నచ్చని వారి ఓట్లను లక్షల సంఖ్యలో తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణలో కూడా సుమారు 80 లక్షల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా తమ ఓటు జాబితాలో ఉందో లేదో వెంటనే తనిఖీ చేసుకోవాలని, ఓటు హక్కును కాపాడుకోవాలని విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ అర్బన్ మండలం చింతల్థన, గ్రామంలో ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు..ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ,పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

# ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఓటర్లు ఉన్న ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఎస్ఐఆర్ లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 71 వ పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవల్ అధికారి ఎన్యూమరేషన్ ఫారాలు గురువారం పంపిణీ చేస్తుండగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారంలో అన్ని వివరాలు నింపాలని, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 వ తేదీ వరకు తమ పరిధిలో ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని ఆదేశించారు. జూలై 24వ తేదీలోగా తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఫారాలు నింపడంలో సహాయం చేయాలని తెలిపారు.పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ సుజాత తదితరులు ఉన్నారు.

## యూరియా బస్తాలను
# యాప్ ద్వారానే రైతులు బుకింగ్ చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారిని ప్రణీత**

**పలు దుకాణాల్లో విత్తన మరియు ఎరువుల నిల్వలను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారిని ప్రణీత మరియు మండల ఎస్సై రామకాంత్**
**బలగం టీవీ, బోయినిపల్లి;**

టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి మరియు మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారు కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని పలు దుకాణాల్లో విత్తన మరియు ఎరువుల నిల్వలను పరిశీలించారు.ఈ సందర్భంగా దుకాణదారులు తప్పనిసరిగా యూరియాను యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే అమ్మాలని సూచించారు. ఈ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ గత యాసంగిలోనే మన మండలంలో అమలుపరచారని, 2471 మంది రైతులు 8724 బస్తాలను యాప్ ద్వారా బుక్ చేసుకుని కొనుగోలు చేశారు.ఈ వానకాలంలో కూడా ఈ రోజు వరకు 1032 మంది రైతులు 3375 యూరియా బస్తాలను యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నారు.అందరూ

రైతులు యూరియా కొనుగోలు తప్పనిసరిగా “ఫర్టిలైజర్” యాప్ ద్వారా బుకింగ్ చేసుకొని మాత్రమే కొనుగోలు చేయాలనీ సూచించారు. ఈ యాప్ నీ ప్లే స్టోర్ ద్వారా లేదా లింక్ ద్వారా లేదా మీ సమీప ఎరువుల దుకాణదారుని ద్వారా లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా కానీ ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకుని మీ పంట వివరాలను ధృవీకరించి యూరియా బస్తాలని బుకింగ్ చేసుకోవచ్చు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకి మరియు మధ్యాహ్నం 3 గంటలకి



కొత్తగా వచ్చిన యూరియా బస్తాలను యాప్ లో చూపించడం జరుగుతుంది, ఈ స్టాక్ ను రైతులు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు బుక్ చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారిని ప్రణీత తెలిపారు.

## మాదకద్రవ్యాలతో
# శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి



**సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలి**

**బోయినిపల్లి ఎస్సై రమాకాంత్**
**బలగం టీవీ, బోయినిపల్లి;**

సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని పాఠశాలలో గురువారం రోజున విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ: మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజం మరియు దేశ అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు స్నేహాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం మరియు ఇతర ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు.డ్రగ్స్ వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడటమే కాకుండా నేరప్రవృత్తులు పెరిగే ప్రమాదం ఉంటుందని వివరించారు. విద్యార్థులు ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా మాదకద్రవ్యాల విక్రయాలు గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అంతేకాకుండా, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఔట్ పేషెంట్ రిజిస్టర్, ల్యాబ్, మందులు ఇచ్చే గది, ఇన్ పేషెంట్ వార్డు పరిశీలించి.. రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని పేర్కొన్నారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలని, గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభోత్సవం

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో పాల కేంద్రం నుండి ఇందిరమ్మ కాలానికి వెళ్ళే దారిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 5 లక్షల రూపాయలు మంజురు ఇప్పించిన సందర్భంగా సి.సి రోడ్డు పనులు గురువారం రోజున ప్రారంభించారు. చాలా రోజులుగా రోడ్డు బాగా లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు, సి.సి రోడ్డు పనులు ప్రారంభించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం మరియు ప్రజలు బండి సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజీ ఎంపీటిసి అక్కనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, చంద్రగిరి వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు ఎర్రం మల్లారెడ్డి, నోముల రాజిరెడ్డి, కొడూరి శంకరయ్య, చిలుముల రమేష్, కందాడి కిరణ్ రెడ్డి, రాచర్ల రాజేశం, ముచ్చ రవీందర్ రెడ్డి, రాజశేఖరరెడ్డి, మహిపాల్ రెడ్డి,మచ్చ మధుకర్ రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ప్రత్యేక అధికారి నిర్వహించే సమావేశానికి సన్నద్ధంగా ఉండాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**బలగం టీవీ రాజన్న సిరిసిల్ల:**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన ప్రత్యేక అధికారి శైలజా రామయ్యర్ నిర్వహించే సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు సమగ్ర నివేదికలు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించి, ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక అధికారి నిర్వహించే అంశాలపై చర్చించారు.

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 వ తేదీ నుండి జూన్ 12 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలు, సంబంధిత శాఖలు సాధించిన ప్రగతి, తదితర అంశాలపై సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ, జెడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బి. శ్రీనివాస చారి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, ఎస్సీ, బీసీ అభివృద్ధి అధికారులు రవీందర్ రెడ్డి, సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**పాఠశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్**
**బలగం టీవీ, బోయినిపల్లి;**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పిజిటి (ఫిజిక్స్) పోస్టును గంటల వారి పారితోషికంపై బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ప్రకటనలో తెలిపారు. తొమ్మిదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఫిజికల్ సైన్స్ బోధించుటకు ఎమ్మెస్సీ (ఫిజిక్స్)తో పాటు బీఈడీలో ఫిజికల్ సైన్స్ మెథడాలజీ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని, అసక్తిగల అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ ధృవపత్రాలతో జూన్ 29 వ తేదీ ఉదయం 10 గంటలకు తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల బోయినిపల్లిలో నిర్వహించబడే డెమోకు హాజరుకావాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ సూచించారు.



## గోదావరిఖనిలో లయన్స్ క్లబ్ అనుబంధ విభాగాల సంస్థాపన వేడుకలు

**బలగం టీవీ, గోదావరిఖని**

రామగుండం లయన్స్ క్లబ్‌కు అనుబంధంగా ఉన్న మూడు నూతన క్లబ్‌ల ద్వితీయ సంస్థాపన వేడుకలు గురువారం గోదావరిఖనిలో అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా క్లబ్‌ల నూతన కార్యవర్గాన్ని (పీ.ఎస్.టి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ లక్ష్మీనగర్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ (పీ.ఎస్.టి)లుగా అనుగం కృష్ణమూర్తి, ఆవునూరి శంకర్, చొక్కారపు వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు.

**నూతన కార్యవర్గాల ఎన్నిక..**

అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని బాధ్యులుగా చిట్టిమల్ల కిశోర్, అల్లాడి నాగరాజు, చింతకింది కృష్ణ.. లయన్స్ క్లబ్ వాసవి పీ.ఎస్.టిలుగా కొమురవెల్లి రాహుల్, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థాపన చైర్మన్ లయన్ చంద్రమోహన్ నూతనంగా ఎన్నికైన ప్రతినిధులతో నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా లయన్ చంద్రమోహన్ మాట్లాడుతూ.. రామగుండం లయన్స్ క్లబ్ సభ్యులంతా ఒకే కుటుంబంలా కలిసికట్టుగా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్లే రాష్ట్రంలోనే క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు, హోదా లభించాయని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుండాలని నూతన కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు హరికృష్ణ, ఆనందం, సాదుల వెంకటేశ్వర్లు, భాస్కర్, నార్ల ప్రసాద్, సోమారపు లావణ్య, సుధాకర్, డాక్టర్ లక్ష్మీవాణి, బంక రామస్వామి, రాజేందర్, చందర్, శ్రావణ్, వినోద్, నరేశ్, రత్నాకర్‌తో పాటు వివిధ ప్రాంతాల క్లబ్ బాధ్యులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సాయి సుదర్శన్ సెంచరీ.. తొలి రోజే భారత్-ఏ భారీ స్కోరు!

**లంక బౌలర్లపై విరుచుకుపడ్డ ఓపెనర్; కెప్టెన్ ధ్రువ్ జురెల్, తెలుగు తేజం షేక్ రషీద్ హాఫ్ సెంచరీలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

శ్రీలంక-ఏ జట్టుతో గురువారం ప్రారంభమైన అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ భారీ స్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓపెనర్ సాయి సుదర్శన్ (175 బంతుల్లో 19 ఫోర్లతో 132) అద్భుత శతకంతో చెలరేగడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తన మొదటి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 333 పరుగుల పటిష్ట స్కోరు చేసింది. సాయి సుదర్శన్‌కు తోడు కెప్టెన్ ధ్రువ్ జురెల్ (68 నాటౌట్), ఆంధ్ర యువ బ్యాటర్, తెలుగు తేజం షేక్ రషీద్ (53 నాటౌట్) బాధ్యతాయుత హాఫ్ సెంచరీలతో క్రీజులో నిలిచారు. లంక బౌలర్లలో సుదీర రెండు వికెట్లు పడగొట్టగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీశారు.

**అదిరిపోయే ఆరంభం..**

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఏ జట్టుకు ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే (25) ఘనమైన ఆరంభాన్ని ఇచ్చారు. లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఈ జోడీ తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించింది. ఆయుష్ పాండేను తిలకరత్నే అవుట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అనంతరం వచ్చిన దేవదత్ పడిక్కల్ (12) త్వరగానే ఎల్బీగా వెనుదిరిగినప్పటికీ.. సాయి సుదర్శన్ మాత్రం నిలకడగా ఆడుతూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

**ఐదో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం**

మూడో వికెట్‌కు రుతురాజ్ గైక్వాడ్ (22)తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ ఆచితూచి ఆడటంతో రన్ రేట్ కాస్త తగ్గింది. 85 పరుగుల భాగస్వామ్యం తర్వాత గైక్వాడ్ ఎల్బీగా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ధ్రువ్ జురెల్ అండతో సాయి సుదర్శన్ క్లాస్ ఇన్నింగ్స్ ఆడుతూ సెంచరీ మార్కును అందుకున్నాడు. 132 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సుదర్శన్‌ను చామిక గుణశేఖర అవుట్ చేశాడు. 217 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన దశలో కెప్టెన్ ధ్రువ్ జురెల్ (138 బంతుల్లో 5 ఫోర్లతో 68), షేక్ రషీద్ (92 బంతుల్లో 4 ఫోర్లతో 53) ఇన్నింగ్స్ బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. లంక బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా సింగిల్స్ తీస్తూ, అదను దొరికినప్పుడు బౌండరీలు బాదారు. ఈ క్రమంలోనే ఇద్దరూ తమ అర్ధశతకాలను పూర్తి చేసుకున్నారు. ఐదో వికెట్‌కు వీరిద్దరూ విడదీయరాని 116 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్‌ను సురక్షిత స్థానంలో నిలిపారు. చేతిలో ఇంకా 6 వికెట్లు ఉండటంతో భారత్-ఏ భారీ స్కోరుపై కన్నేసింది.





# ప్రిక్వార్టర్స్‌కు శ్రీకాంత్, తన్వి

**యూఎస్ ఓపెన్‌లో భారత షట్లర్ల జోరు.. దేవికా, రక్షిత కూడా ముందంజ**

**బలగం టీవి, హైదరాబాద్**

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, మహిళల సింగిల్స్‌లో తన్వి శర్మ విజయాలు సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత పొందారు. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన కిదాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లో స్వదేశానికే చెందిన దయానంద్‌పై ఆధిపత్యం చెలాయించాడు. కేవలం రెండు గేమ్‌ల్లోనే 21-14, 21-12 తేడాతో విజయం సాధించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో తన్వి శర్మ పోరాట పటిమ కనబరిచింది. జర్మనీకి చెందిన యవాన్ లీతో జరిగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌లో తీవ్ర పోటీ ఎదురైనప్పటికీ 23-21తో గెలిచిన తన్వి, రెండో గేమ్‌లో 21-16తో ఆధిక్యం ప్రదర్శించి ప్రిక్వార్టర్ బెర్తు దక్కించుకుంది. ఇక మహిళల విభాగంలో దేవికా, రక్షిత కూడా విజయాలు నమోదు చేసి ముందంజ వేశారు. అయితే భారత షట్లర్లు అన్మోల్ ఖర్బ్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో మరో భారత ఆటగాడు రౌనక్ చౌహాన్ కూడా రెండో రౌండ్‌కు చేరాడు. శంకర్ ముత్తుస్వామిపై జరిగిన తొలి రౌండ్ పోరులో 23-21, 21-16 తేడాతో విజయం సాధించి తన జోరును కొనసాగించాడు.



# నానమ్మకు బంగారు గాజులు బహూకరించిన నితీష్ రెడ్డి

**సొంతూరిలో సందడి.. గాయం నుంచి కోలుకుని త్వరలోనే రీఎంట్రీపై ఆశాభావం**

**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా యువ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి నాలుగేళ్ల అనంతరం తన స్వగ్రామమైన గాజువాకకు చేరుకుని భావోద్వేగ క్షణాలను పంచుకున్నాడు. తన నానమ్మకు బంగారు గాజులు బహూకరించి కుటుంబ సభ్యులపై తన ప్రేమాభిమానాలను చాటుకున్నాడు. స్వయంగా గాజులు తొడిగిన అనంతరం ఆమె ఆశీర్వాదాలు తీసుకున్నాడు.నితీష్ రెడ్డి స్వగ్రామానికి రావడంతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది. అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నితీష్ రెడ్డి, స్వగ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు ఇక్కడే ఉన్నాయని, చాలా రోజుల తర్వాత గ్రామానికి రావడం ఆనందంగా ఉందన్నారు. తాను ఈ స్థాయికి చేరుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న నితీష్, చిన్నప్పటి నుంచి తన కలలను నమ్మి అన్ని విధాలుగా ప్రోత్సహించారని చెప్పారు. వారి త్యాగాలు, కష్టాల ఫలితంగానే భారత జట్టు తరపున ఆడే అవకాశం దక్కిందన్నారు.భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ తనకు ఆదర్శమని నితీష్ తెలిపారు. కోహ్లీ ఆటతీరు, అంకితభావం, ఫిట్‌నెస్ తనను ఎంతో ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. భారత జట్టులో తన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైందని, జట్టులో స్థిరమైన స్థానం సంపాదించి దేశానికి మరిన్ని విజయాలు అందించడమే తన లక్ష్యమని చెప్పారు.

గాయం గురించి స్పందించిన నితీష్ రెడ్డి, పూర్తిగా కోలుకోవడానికి మరో నాలుగు నుంచి ఐదు వారాల సమయం పడుతుందని వెల్లడించారు. అనంతరం జరిగే జింబాబ్వే సిరీస్‌తో మళ్లీ మైదానంలోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తొడ కండరాల గాయానికి గురైన నితీష్ రెడ్డి, వైద్యుల సూచన మేరకు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యాన్ష్ షెడ్జేను బీసీసీఐ ఎంపిక చేసింది. ఇదిలా ఉండగా, ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో భారత జట్టు బరిలోకి దిగనుండగా, యువ ఆటగాళ్ల ప్రదర్శనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బంగ్లాపై భారత్ ఘన విజయం..





**సెమీస్ రేసులో 'ఉమెన్ ఇన్ బ్లూ'!**

**5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసిన టీమిండియా; షెఫాలీ ధనాధన్ హాఫ్ సెంచరీ, రాధా యాదవ్ మ్యాజిక్**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ రేసులో నిలవాలంటే ఖచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో 'ఉమెన్ ఇన్ బ్లూ' అద్భుత ప్రదర్శన చేసింది. గురువారం ఓల్డ్ ట్రాఫర్డ్ వేదికగా ఏకపక్షంగా జరిగిన పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 137 పరుగుల లక్ష్యాన్ని భారత్ 16.5 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఊదేశింది. టోర్నీలో మూడో విజయంతో భారత్ సెమీస్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకోగా, ఈనెల 28న ఆస్ట్రేలియాతో జరగబోయే కీలక పోరుకు ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది.

**షెఫాలీ, జెమీమా మెరుపులు**

స్వల్ప లక్ష్య చేధనలో ఓపెనర్ షెఫాలీ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్‌కు విజయం సులువైంది. స్మృతి మంధాన (8) త్వరగానే నిరాశపరిచినా, వన్‌డౌన్ బ్యాటర్ యస్తికా భాటియా (23)తో కలిసి షెఫాలీ బంగ్లా బౌలర్లపై విరుచుకుపడింది. ఈ జోడీ ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 63/1తో పటిష్ట స్థితికి చేరింది. కేవలం 29 బంతుల్లోనే అర్ధ శతకాన్ని పూర్తి చేసుకున్న షెఫాలీ.. మొత్తంగా 34 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్సర్‌తో 53 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

ఆ తర్వాత యస్తికా, రిచా ఘోష్ (10) వరుసగా అవుట్ కావడంతో భారత్ కాస్త డిఫెన్స్‌లో పడినప్పటికీ.. జెమీమా రోడ్రిగ్స్ (15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 26) వేగంగా ఆడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. జెమీమా అవుటైనా ఆఖర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (13 నాటౌట్), దీప్తి శర్మ (5 నాటౌట్) కలిసి లాంఛనాన్ని పూర్తి చేశారు.

**రాధా, శ్రీ చరణి స్పిన్ మ్యాజిక్**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్‌ను భారత స్పిన్నర్లు కట్టడి చేశారు. ఓపెనర్ జువైరియ ఫెర్దౌస్ (33), కెప్టెన్ నిగార్ సుల్తానా (32) రాణించడంతో ఒక దశలో బంగ్లాదేశ్ 150 పరుగులకు పైగా స్కోరు చేసేలా కనిపించింది. అయితే భారత స్పిన్నర్ రాధా యాదవ్ (3/28) వరుస ఓవర్లలో వికెట్లు తీసి బంగ్లాను దెబ్బకొట్టింది. ఆఖరి ఓవర్ వేసిన యువ స్పిన్నర్ శ్రీ చరణి (2/21) కేవలం 3 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టడంతో బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 136/8 పరుగులకే పరిమితమైంది.

**రికార్డు దిశగా శ్రీ చరణి..**

భారత యువ బౌలర్ శ్రీ చరణి ఈ టోర్నీలో అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తోంది. ప్రస్తుత టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో ఆమె ఇప్పటివరకు 12 వికెట్లు పడగొట్టింది. పూనమ్ యాదవ్ (10 వికెట్లు) రికార్డును దాటేసిన చరణి.. మరో 4 వికెట్లు తీస్తే 2024లో కివీస్ బౌలర్ అమేలియా కెర్ (15 వికెట్లు) నెలకొల్పిన అత్యధిక వికెట్ల రికార్డును అధిగమిస్తుంది.

**సంక్షిప్త స్కోర్లు:**

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 136/8 (ఫెర్దోస్ 33, నిగార్ 32; రాధా యాదవ్ 3/28, శ్రీ చరణి 2/21)

భారత్: 16.5 ఓవర్లలో 139/5 (షెఫాలీ వర్మ 53, జెమీమా 26; రితూ మోని 2/29, రబెయ

# హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌కు మరో విజయం

**అభిరథ్ వీర విహారం..**

**99 పరుగులతో కెప్టెన్ మెరుపులు..**

**196 పరుగుల లక్ష్యాన్ని 18 ఓవర్లలోనే ఛేదించిన హైదరాబాద్**

**బలగం టీవి, హైదరాబాద్**

టీ20 లీగ్‌లో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ మరో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. రంగారెడ్డి రైజర్స్‌పై అన్ని విభాగాల్లో ఆధిపత్యం చెలాయించిన హైదరాబాద్ జట్టు 196 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్ జట్టుకు ఘన విజయాన్ని అందించింది. ఈ విజయంతో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. మ్యాచ్‌లో 99 పరుగులతో రాణించిన అభిరథ్ రెడ్డికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించగా, యశ్వీర్ గౌడ్ 'గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. అవనీశ్ 53 పరుగులతో శుభారంభం అందించగా, ఆదిత్య జవ్వాజి 58 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆరోన్ జార్జ్ 35, తనయ్ త్యాగరాజన్ 31 పరుగులతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో ప్రణవ్ వర్మ రెండు వికెట్లు పడగొట్టగా, షణ్ముఖ, అఖిల్ చెరో వికెట్ తీశారు.

196 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్‌కు ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోవడం ఎదురుదెబ్బగా మారింది. వికాస్ రెడ్డి మూడు పరుగులకే ఔటవగా, అన్విత్ రెడ్డి నాలుగు పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో హైదరాబాద్ స్వల్ప వ్యవధిలోనే రెండు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. అయితే కెప్టెన్ అభిరథ్ రెడ్డి ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లే నుంచే బౌలర్లపై ఎదురుదాడికి దిగిన అతడు వరుస బౌండరీలు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.



**అభిరథ్-షణ్ముఖ భాగస్వామ్యం**

అభిరథ్‌కు షణ్ముఖ అశ్విన్ అద్భుత సహకారం అందించాడు. ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కేవలం 24 బంతుల్లోనే అభిరథ్ అర్ధశతకం పూర్తి చేసి ప్రత్యర్థి బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చాటాడు.

షణ్ముఖ 18 బంతుల్లో 30 పరుగులు చేసి ఔటైనప్పటికీ, అభిరథ్ తన దూకుడు కొనసాగించాడు. అనంతరం గడుగు గణేశ్‌తో కలిసి మరో కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

**శతకం చేజారినా చిరస్మరణీయ ఇన్నింగ్స్**

వ్యక్తిగత శతకానికి ఒక్క పరుగు దూరంలో అభిరథ్ ఔటయ్యాడు. 45 బంతుల్లో 10 ఫోర్లు, ఆరు సిక్స్‌ల సాయంతో 99 పరుగులు చేసిన అతడు భారీ షాట్‌కు యత్నించి క్యాచ్ ఇచ్చాడు. అయినప్పటికీ మ్యాచ్‌ను హైదరాబాద్ చేతుల్లో పెట్టిన అతడి ఇన్నింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

అభిరథ్ ఔటైన అనంతరం యశ్వీర్ గౌడ్ దూకుడుగా ఆడాడు. కేవలం 10 బంతుల్లో ఒక ఫోర్, మూడు సిక్స్‌లతో 30 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. గడుగు గణేశ్ 25 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివరకు హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 18 ఓవర్లలోనే నాలుగు వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించడం ద్వారా హైదరాబాద్ జట్టు టైటిల్ రేసులో తమ సత్తాను మరోసారి నిరూపించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

# నాకౌట్‌లోకి దూసుకెళ్లిన బ్రెజిల్





**స్కాట్లాండ్‌పై 3-0 ఘన విజయం.. మెక్సికో, దక్షిణాఫ్రికా ముందంజ**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రతిష్టాత్మక ఫిఫా ప్రపంచకప్‌లో బ్రెజిల్ జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన బ్రెజిల్ జట్టు తమదైన ఆటతీరుతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. గ్రూప్-సీ లీగ్ పోరులో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో విజయం సాధించి రౌండ్-32లోకి అడుగుపెట్టింది.

ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో మొత్తం ఏడు పాయింట్లు సాధించిన బ్రెజిల్ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అదే గ్రూప్ నుంచి మొరాకో కూడా నాకౌట్ బెర్తును దక్కించుకుంది. మ్యాచ్ ప్రారంభమైన ఏడో నిమిషంలోనే వినిసియస్ జూనియర్ గోల్ చేసి బ్రెజిల్‌కు ఆధిక్యం అందించాడు. తొలిఅర్ధం అదనపు సమయంలో మరో గోల్ నమోదు చేసి జట్టుకు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండోఅర్ధంలో 60వ నిమిషంలో మథియస్ కున్హా గోల్‌తో బ్రెజిల్ విజయం ఖరారైంది. గాయం కారణంగా గత మ్యాచ్‌లకు దూరమైన స్టార్ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్ ఈ మ్యాచ్‌లో తిరిగి బరిలోకి దిగడం అభిమానులకు ఉత్సాహాన్నిచ్చింది. బంతిపై ఆధిపత్యం చెలాయించిన బ్రెజిల్ జట్టు స్కాట్లాండ్‌పై పూర్తి ఆధిక్యం ప్రదర్శించింది. 1998 తర్వాత తొలిసారిగా ప్రపంచకప్‌లో పాల్గొన్న స్కాట్లాండ్ జట్టు నాకౌట్ దశకు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. బ్రెజిల్ జట్టు ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో మియామి, బోస్టన్ ప్రాంతాలు సందడిగా మారాయి.

**మెక్సికోకు హ్యాట్రిక్ విజయాలు**

గ్రూప్-సీలో చెక్ రిపబ్లిక్‌పై మెక్సికో 3-0తో ఘన విజయం సాధించింది. మతియో చావెజ్, జులియన్ క్యుఫినోస్, అల్వెరో గోల్స్‌తో మెక్సికో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి నాకౌట్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌తో మెక్సికో దిగ్గజ గోల్‌కీపర్ గులెర్మో ఒచోవా తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆరో ప్రపంచకప్‌లో పాల్గొన్న ఒచోవాకు అభిమానులు ఘనంగా వీడ్కోలు అందించారు.

**దక్షిణాఫ్రికా సంచలనం**

టోర్నీలో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. దక్షిణకొరియాపై 1-0తో విజయం సాధించి నాకౌట్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ 63వ నిమిషంలో తపెలో మసెకో చేసిన అద్భుత గోల్ జట్టుకు విజయాన్ని అందించింది.

**హైతీ పోరాటం వృథా**

52 సంవత్సరాల తర్వాత ప్రపంచకప్‌లో ఆడుతున్న హైతీ జట్టు తమ చివరి మ్యాచ్‌లో పోరాట పటిమ కనబరిచింది. మొరాకోతో జరిగిన మ్యాచ్‌లో 4-2 తేడాతో ఓడినప్పటికీ తొలిసారి ప్రపంచకప్‌లో గోల్ నమోదు చేసి చరిత్ర సృష్టించింది. విల్సన్ చేసిన గోల్‌తో పాటు ప్రత్యర్థి ఓన్ గోల్ ద్వారా హైతీ రెండు గోల్స్ సాధించింది.



# 'ఓజీ' సీక్వెల్ ఖరారు..




**ఇకపై 'ఓజీ యూనివర్స్'!లిలి**
**దర్శకుడు సుజీత్‌తో పవన్ కళ్యాణ్ చర్చలు**
**'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' అధికారిక ప్రకటన**

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఆయన హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'కి సీక్వెల్ రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కేవలం సీక్వెల్ మాత్రమే కాకుండా, ఇది 'ఓజీ యూనివర్స్'లో భాగంగా ఉండనుందని స్పష్టం చేసింది. ఈ మేరకు పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రానున్నట్లు వెల్లడించారు.

**'ఎక్స్' వేదికగా ఆసక్తికర వీడియో విడుదల**

పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ తమ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంది. ఇందులో దర్శకుడు సుజీత్, పవన్ కళ్యాణ్ 'ఓజీ' ఫ్రాంచైజీలోని రెండో భాగం గురించి చర్చిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. "తుఫానుకు ముందు ప్రశాంతత ఉంటుంది. గంభీర చెప్పని కథ ఇప్పుడు ఆవిష్కృతం కాబోతోంది" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. సుజీత్ ఆలోచనలకు, కథనానికి ముగ్ధుడైన పవన్, తన వైపు నుంచి కావాల్సినదంతా సిద్ధంగా ఉంటుందని హామీ ఇవ్వడం ఈ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సీక్వెల్ కేవలం ఓ కొనసాగింపు చిత్రం కాదని, అనేక పాత్రలు, వాటికి సంబంధించిన లోతైన కథలతో కూడిన ఓ పెద్ద సినిమాటిక్ అనుభూతిని ఇస్తుందని వీడియో ద్వారా తెలుస్తోంది. 'ఓజీ యూనివర్స్' పరిధిని వివరిస్తూ, సుజీత్ కొన్ని ఆసక్తికరమైన అంశాలను పవన్‌తో పంచుకున్నారు. సినిమాలో మంచు నెమ్మదిగా రక్తంగా మారే సన్నివేశం, ఓ రహస్యమైన 'అవుట్‌సైడర్' పాత్ర, 'ఓజీ' పెంపుడు జంతువు ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. 'ఓజీ 2'లో ఓ సన్నివేశం 'ఐకానిక్ విజువల్'గా నిలిచిపోతుందని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం ఇప్పుడు ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

గతంలో వచ్చిన 'దే కాల్ హిమ్ ఓజీ' భారీ విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా, పవన్ కళ్యాణ్‌ను ఓ సరికొత్త లార్జర్ దేన్ లైఫ్ అవతార్‌లో చూపించింది. సుజీత్ దర్శకత్వంలో వచ్చిన ఈ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ డ్రామా, సినిమా పట్ల పవన్ కళ్యాణ్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తాజాగా ఈ సీక్వెల్ చర్చలు 'ఓజీ యూనివర్స్' ఎంత భారీగా ఉండనుందో చిన్న హింట్ ఇచ్చి, అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి.




## అజయ్ దేవ్‌గన్, ఆనంద్ ఎల్ రాయ్ కాంబో..
## 'చౌహాన్' టైటిల్ ఖరారు!

**పుల్వామా నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా; ఆకట్టుకుంటున్న అనౌన్స్‌మెంట్ వీడియో**
**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవ్‌గన్ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ కలయికలో తెరకెక్కబోతున్న నూతన చిత్రానికి 'చౌహాన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను గురువారం మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. ఈ వీడియోలో అజయ్ దేవ్గన్ ఇంటెన్స్, రగ్డ్ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

**మిలిటరీ నేపథ్యంలో కథాంశం**

కాశ్మీర్ పుల్వామా బ్యాక్‌డ్రాప్‌లో మిలిటరీ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం ఉండబోతోందని బాలీవుడ్ వర్గాల సమాచారం. తాజాగా విడుదలైన వీడియోలో యుద్ధ వాతావరణం, పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఆనంద్ ఎల్ రాయ్ మార్క్ ఎమోషన్స్, అజయ్ దేవ్‌గన్ యాక్షన్ ఎలిమెంట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.

జియో స్టూడియోస్‌కు చెందిన జ్యోతి దేశ్‌పాండేతో కలిసి ఆనంద్ ఎల్ రాయ్ (కలర్ ఎల్లో ప్రొడక్షన్స్), హిమాన్షు శర్మ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నీరజ్ యాదవ్ ఈ సినిమాకు కథను అందించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న 'చౌహాన్'.. అజయ్ దేవ్గన్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేసింది.

# ఇండస్ట్రీ అసలు సేఫ్ కాదు.. ప్రతి క్షణం నరకమే!

**సినీ పరిశ్రమలోని చీకటి కోణాలపై సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు**
**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత చేసిన వ్యాఖ్యలు ఫిల్మ్ సర్కిల్స్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. సినిమా ఇండస్ట్రీలోని చీకటి కోణాలపై, ముఖ్యంగా మహిళా ఆర్టిస్టుల భద్రతపై ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సంచలన నిజాలను బయటపెట్టారు. కొత్తగా వచ్చే అమ్మాయిలకు ఇండస్ట్రీ ఎంతవరకు సేఫ్? అనే ప్రశ్నపై ఆమె దాపరికం లేకుండా స్పందించారు.

**ఆ నాలుగు శక్తులు లేకపోతే కష్టమే..**

చిత్ర పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదని సునీత స్పష్టం చేశారు. "ఒక అమ్మాయి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలంటే ఆమెకు కచ్చితంగా నాలుగు శక్తులు ఉండాలి. అవి.. ఎమోషనల్ (మానసిక స్థైర్యం), ఫిజికల్, మెంటల్, మరియు ఫైనాన్షియల్ స్ట్రెంత్స్. ఈ నాలుగూ లేకపోతే ఇండస్ట్రీ ఇక్కడ ప్రతి క్షణం నరకం చూపిస్తుంది, ఎన్నో కఠినమైన పరీక్షలు పెడుతుంది. నిజం చెప్పాలంటే ఇండస్ట్రీ అసలు సేఫ్ కాదు" అని ఆమె కుండబద్దలు కొట్టారు.

"ఇక్కడ పవర్, అథారిటీ చేతుల్లో పెట్టుకున్న కొందరు వ్యక్తులు.. అవతలి వారి బలహీనతలను క్యాష్ చేసుకోవాలని చూస్తారు. కేవలం కొత్తగా అవకాశాల కోసం వచ్చే వాళ్లనే కాదు... ఇండస్ట్రీలో ఆల్రెడీ మంచి పేరు, క్రేజ్ తెచ్చుకున్న మహిళలను కూడా వదలరు. చేతులు వేయడం, అనవసరమైన చనువు తీసుకోవడం వంటివి ప్రతి స్టేజ్‌లోనూ ఎదురవుతాయి" అని సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

మగాళ్ల ప్రవర్తనపై సునీత మాట్లాడుతూ.. "ఒక పురుషుడు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడో.. ఆ మాటల్లోనే లేదా అతడు తాకిన ఒకే ఒక్క టచ్‌లోనే ఆడపిల్లలకి వారి ఉద్దేశం వెంటనే తెలిసిపోతుంది. చాలా మంది వేరే దారి లేక, సినిమా అవకాశాల కోసం అవన్నీ భరిస్తూ లోపల ఏడుస్తుంటారు. కానీ, నాలాంటి వాళ్లు మాత్రం ఆ పనులు చేయలేక, అలాంటి వాతావరణం నచ్చక ఇండస్ట్రీ నుండి బయటకు వచ్చేస్తారు" అని తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. సునీత చేసిన ఈ బోల్డ్ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారాయి.

## సెప్టెంబర్ 10న 'సర్దార్ 2' విడుదల!

**వృద్ధుడి గెటప్‌లో కార్తి పవర్‌ఫుల్ లుక్; ఆకట్టుకుంటున్న ప్రమోషనల్ వీడియో**
**బలగం టీవీ, హైదరాబాద్**



తమిళ స్టార్ హీరో కార్తి కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీ ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని 2026, సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక పవర్‌ఫుల్ ప్రమోషనల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు.

తాజాగా విడుదలైన వీడియోలో రా ఏజెంట్ చంద్రబోస్ అలియాస్ సర్దార్ పాత్రలో కార్తి వృద్ధుడి గెటప్‌లో కనిపించి అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నారు. మంటల మధ్య రైఫిల్ పట్టుకుని నిలబడిన ఆయన ఇంటెన్స్ లుక్, సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉండనున్నాయని స్పష్టం చేస్తోంది. "ఏజెంట్ కార్తి వస్తున్నాడు.. జీవితకాలపు మిషన్‌కు సిద్ధంగా ఉండండి" అనే క్యాప్షన్‌తో చిత్రయూనిట్ ఈ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకుంది.

2022లో విడుదలై బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్లకు పైగా వసూళ్లతో ఘన విజయం సాధించిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. మొదటి భాగం పెద్ద సక్సెస్ కావడంతో, ఈ సీక్వెల్‌ను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సర్దార్ ఆరిజిన్ స్టోరీతో పాటు, అతని కుమారుడు ఇన్‌స్పెక్టర్ విజయ్ సాహసాలను కూడా చూపించనున్నారు.

**ఐదు భాషల్లో గ్రాండ్ రిలీజ్**

ఈ చిత్రంలో వైవిధ్య భరిత నటుడు ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' అనే శక్తివంతమైన ప్రతినాయకుడి (విలన్) పాత్రలో నటిస్తుండగా, మాళవిక మోహనన్, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జులై 2024లో ప్రారంభమైన ఈ చిత్ర చిత్రీకరణ జూన్ 2025 నాటికి పూర్తయింది. శ్యామ్ సీఎస్ ఈ చిత్రానికి పవర్‌ఫుల్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళంతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేయనుండగా, త్వరలోనే ట్రైలర్‌కు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది.

# అమరావతిలో అట్టహాసంగా 'ఎన్‌బీకే112' ప్రారంభం

**బాలయ్య, కొరటాల క్రేజీ కాంబో షురూ!**
**రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా చిత్రం; 2027 వేసవిలో విడుదల**
**బలగం టీవీ, హైదరాబాద్**




నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ (వర్కింగ్ టైటిల్ 'చీదీఖ 112') ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా పూజా కార్యక్రమాలతో అట్టహాసంగా ప్రారంభమైంది. సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకతో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.

అమరావతిలో ఈ సినిమాను ప్రారంభించడం వెనుక ఉన్న విశేషాలను నిర్మాత సుధాకర్ చెరుకూరి పంచుకున్నారు. "రాజధాని అమరావతిలో ఒక భారీ సినిమా ప్రారంభోత్సవం చేయాలనేది బాలకృష్ణ గారి చిరకాల స్వప్నం. అది మా బ్యానర్‌లోనే నెరవేరడం చాలా గర్వంగా ఉంది. ప్రకాశం జిల్లా వాడినైన నేను, మన రాజధాని నడిబొడ్డున ఈ సినిమాను లాంచ్ చేయడం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. గత మూడు నాలుగేళ్లుగా బాలయ్య గారితో సినిమా చేయాలన్న నా కోరిక ఇప్పటికి నెరవేరింది" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్..**

ఈ సినిమాను సుమారు రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నట్లు నిర్మాత అధికారికంగా ప్రకటించారు. ఆగస్టు నెల నుంచి చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, 2027 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు.

**స్థానిక కళాకారులకు ప్రాధాన్యం**

ఈ ప్రాజెక్ట్ కేవలం వినోదాన్ని పంచడమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక కళాకారులకు, సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఏపీలో ఉన్న ప్రతిభావంతులకు ఈ సినిమాలో ప్రాధాన్యత ఇస్తామని, ఈ సినిమా స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రంలో మరిన్ని ఫిలిం స్టూడియోలు, మౌలిక వసతులు ఏర్పాటవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక సందేశాన్ని మాస్ ఎలిమెంట్స్‌తో చెప్పడంలో సిద్ధహస్తుడైన కొరటాల శివ, బాలయ్యను ఏ రేంజ్ పవర్‌ఫుల్ పాత్రలో చూపిస్తారోనని ఇటు నందమూరి అభిమానులు, అటు ఇండస్ట్రీ వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## ' 70 శాతం వసూళ్లు ఏపీ నుంచే.. ఇక్కడే షూటింగ్‌లు పెరగాలి'



తెలుగు చిత్ర పరిశ్రమ బాక్సాఫీస్ ఆదాయంపై నటసింహం, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌కు వచ్చే మొత్తం వసూళ్లలో దాదాపు 70 శాతం వాటా ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుందని, మిగిలిన 30 శాతం మాత్రమే తెలంగాణ నుంచి లభిస్తుందని ఆయన విశ్లేషించారు. స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కలయికలో బాలకృష్ణ నటిస్తున్న నూతన చిత్రం (వర్కింగ్ టైటిల్ 'చీదీఖ 112') గురువారం రాజధాని అమరావతి వేదికగా పూజా కార్యక్రమాలతో అట్టహా సంగా ప్రారంభమైంది. సినీ, రాజకీయ ప్రముఖులు హాజరైన ఈ వేడుకలో బాలయ్య చిత్ర పరిశ్రమ భవిష్యత్తుపై కీలక ప్రసంగం చేశారు.

**ఏపీలోనే ఎక్కువ సినిమాలు తీశా..**

సినిమా రంగానికి సంబంధించి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక వాటాను అందిస్తున్నందున, ఈ రాష్ట్రంలో మరిన్ని సినిమా షూటింగ్‌లు జరగాలని, అలాగే మెరుగైన చిత్ర మౌలిక సదుపాయాలు (ఫిలిం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అభివృద్ధి చెందాలని బాలకృష్ణ ఆకాంక్షించారు. "చాలామంది ఇతర తెలుగు హీరోల కంటే నేనే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ సినిమాలు షూట్ చేశాను. భవిష్యత్తులోనైనా చిత్రనిర్మాతలు తమ ప్రాజెక్టుల చిత్రీకరణ కోసం ఆంధ్ర రాష్ట్రాన్ని ఎంచుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నడిబొడ్డున ఈ సినిమా లాంచ్ కావడం ఏపీలో సినిమా పరిశ్రమ విస్తరణకు మంచి స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ చిత్రంలో నందమూరి బాలకృష్ణ ఒక సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం హింట్ ఇచ్చింది. నేటి ప్రారంభోత్సవంలో బాలయ్య లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. సామాజిక సందేశాన్ని మాస్ ఎలిమెంట్స్‌తో చెప్పే కొరటాల శివ.. బాలయ్యను సరికొత్త పంథాలో ప్రెజెంట్ చేయబోతున్నారు.

## ఆశించిన అవుట్‌పుట్ కోసం 90 టేకులు..

**రాజమౌళి ఒక శ్రమజీవి**
**లితెల్లవారుజామున 5:15 గంటలకే సెట్స్‌కు జక్కన్న;**
**'వారణాసి' షూటింగ్ విశేషాలు పంచుకున్న మలయాళ స్టార్ పృథ్వీరాజ్**
**బలగం టీవీ, హైదరాబాద్**



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి పనితీరు, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావంపై మలయాళ అగ్ర కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'లో పృథ్వీరాజ్ ప్రతినాయకుడు (విలన్) 'కుంభ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కఠినమైన పనివేళలు, తన అనుభవాలను ఆయన తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. "నేను ఇప్పటివరకు కలిసి పనిచేసిన దర్శకులలో రాజమౌళి అత్యంత శ్రమజీవి. తొలి సినిమా అవకాశం కోసం దశాబ్దాలుగా వేచి చూస్తున్న ఓ నూతన దర్శకుడిలో ఉండే తపన, కసి, ఉత్సాహం ఆయనలో కనిపిస్తాయి. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఉత్సాహంతో, పూర్తి సన్నద్ధతతో ఆయన చిత్రీకరిస్తారు" అని ప్రశంసల జల్లు కురిపించారు.

'వారణాసి' సెట్స్‌లోని పనివేళలను గుర్తుచేసుకుంటూ.. "ఉదయం 7 గంటలకు చిత్రీకరణ ప్రారంభం కావాల్సి ఉంటే, రాజమౌళి తెల్లవారుజామున 5:15 గంటలకే సెట్స్‌కు చేరుకుంటారు. నటీనటులు రాకముందే తన సాంకేతిక బృందంతో కలిసి పలుమార్లు రిహార్సల్స్ పూర్తి చేస్తారు. లంచ్ బ్రేక్ కేవలం 20 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఒక్కోసారి పర్ఫెక్ట్ అవుట్‌పుట్ కోసం ఒకే సన్నివేశానికి 90కి పైగా టేకులు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి" అని వెల్లడించారు. నటీనటులకు హావభావాలను వివరించేటప్పుడు రాజమౌళి స్వయంగా నటించి చూపిస్తారని, ఆయనలోని నటుడు అద్భుతమని కొనియాడారు.

రాజమౌళితో పనిచేయడం ఒక నటుడిగా, వ్యక్తిగా తనకు గొప్ప అభ్యాస అనుభవాన్ని (లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్) ఇస్తోందని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా 2027, ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ భారీ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తుండగా, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ 'మందాకిని' పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్రేజీ అప్‌డేట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఆకట్టుకుంటున్న 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్..

**విడుదల చేసిన హీరో నితిన్!**
**నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఎమోషనల్ లవ్‌స్టోరీ; సోమశేఖర్ రెడ్డి దర్శకత్వంలిలి**
**బలగం టీవీ, హైదరాబాద్**



కేఎం అలియాస్ కృష్ణమోహన్, పూజా సుందర్ శెట్టి జంటగా నటిస్తున్న నూతన చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ శనివారం విడుదలైంది. టాలీవుడ్ ప్రామిసింగ్ హీరో నితిన్ ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసి, చిత్రబృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కృష్ణ మోహన్ సల్లగుండ్ల స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సోమశేఖర్ రెడ్డి దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైవిధ్యమైన కథ, కథనాలతో ఒక ఫీల్ గుడ్ ఎమోషనల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపొందుతోందని దర్శకుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ భావోద్వేగ ప్రేమకథ అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుందని, ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ෆ ఈ చిత్రంలో ముఖ్య పాత్రధారులైన కృష్ణమోహన్, పూజా సుందర్ శెట్టిలతో పాటు టాలీవుడ్ ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇ.రాజయ్య కథ, స్క్రీన్‌ప్లే అందించగా.. చైతన్య సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాహిత్య సాగర్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, సత్య గిద్దుటూరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్ర టీజర్, ఆడియో అప్‌డేట్స్‌ను ప్రకటిస్తామని చిత్రబృందం పేర్కొంది.

## రూ.5,500 కోట్ల ఫ్రేమ్.. ఒక్కచోట సినీ దిగ్గజాలు



**నవీన్ పోలిశెట్టి ఫన్నీ వీడియో వైరల్.. భారీ ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు**
**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, నటులు ఒకే వేదికపై కనిపించి సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. దర్శకులు సుకుమార్, ప్రశాంత్ నీల్, లోకేష్ కనగరాజ్, నటుడు-దర్శకుడు రిషభ్ శెట్టి, టాలీవుడ్ యువ హీరో నవీన్ పోలిశెట్టి, నిర్మాతలు నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, దర్శకుడు హరీశ్ శంకర్ ఒకేచోట కలిసిన ఫొటోలు ఇప్పటికే నెట్టింట వైరల్‌గా మారాయి.ఈ సమావేశానికి సంబంధించి నటుడు నవీన్ పోలిశెట్టి తన సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ఫన్నీ వీడియో మరింత ఆకర్షణగా నిలిచింది. వీడియోలో సరదాగా మాట్లాడుతూ అక్కడ ఉన్న సినీ ప్రముఖుల మార్కెట్ విలువను లెక్కగట్టిన నవీన్, లోకేష్ కనగరాజ్‌కు రూ.500 కోట్లు, రిషభ్ శెట్టికి రూ.800 కోట్లు, మైత్రీ సంస్థ నిర్మాతలు మరియు సుకుమార్ కలిపి రూ.2,000 కోట్లు, ప్రశాంత్ నీల్‌కు రూ.2,000 కోట్లు, తనకు రూ.100 కోట్లు అంటూ మొత్తం కలిపి ఇది రూ.5,500 కోట్ల ఫ్రేమ్ అని వ్యాఖ్యానించారు.నవీన్ పోలిశెట్టి చెప్పిన ఈ సరదా వ్యాఖ్యలు, అక్కడున్న దర్శకుల స్పందనలు వీడియోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. ఇంతమంది పాన్ ఇండియా స్థాయి సినీ ప్రముఖులు